

భూపాలపల్లి సుభాష్‌కాలనీలోని సఖి సెంటర్



- రెండేళ్లుగా సంక్షేమ శాఖ ఆధీనంలో సఖి కేంద్రం
- మళ్లీ స్వచ్ఛంద సంస్థకు సెంటర్ అప్పగింత
- ఎట్టకేలకు మళ్లీ ఎన్జీవోకే బాధ్యతలు
- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- సెంటర్‌ను దక్కించుకొనేందుకు జోరుగా పైరవీలు

ఎన్జీవో దరికి సఖి



భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సఖి సెంటర్లకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నిర్వహణ సరిగా లేని కేంద్రాలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా భూపాలపల్లిలోని సఖి సెంటర్‌ను మళ్లీ స్వచ్ఛంద సంస్థలకే అప్పజెప్పాలని నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్‌జారీ చేసింది.

ముఖ్యోద్దేశం ఏమిటంటే...

మహిళల రక్షణ, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోసం సఖి సెంటర్లను ఏర్పాటు చేసింది. హింసకు గురైన మహిళలు, యువతులకు ఒకే చోట వైద్య, పోలీసు, న్యాయ సహాయం అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, అవసరమైతే తాత్కాలిక వసతి కల్పించడం సఖి సెంటర్ల ముఖ్యోద్దేశం. గృహహింస, వరకట్న వేధింపులు, పని చేసే చోట వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్లల అమ్మకం, అక్రమ రవాణా తదితర సమస్యలను ఎదుర్కొనే మహిళలకు అండగా నిలవడం ఈ కేంద్రాల నిర్వాహకుల పని. మహిళలకు ఏ సమస్య వచ్చినా నేరుగా సమాచారం అందించి సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ నంబరు 181 ఉంటుంది. ఈ సెంటర్ల నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు అప్పటి ప్రభుత్వం అప్పగించింది.

భూపాలపల్లిలో నాలుగేళ్ల క్రితం ప్రారంభం

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సఖి సెంటర్‌ను 2020లో ఏర్పాటు చేశారు. అప్పటి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా ప్రారంభమైంది. నిబంధనల ప్రకారం రెండేళ్ల కాలపరిమితిపై ఈ సెంటర్ నిర్వహణను ఓ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. దీని కాలపరిమితి ముగిసిన తర్వాత మరో సంస్థ బాధ్యతలు చేపట్టింది. అయితే.. కొన్ని ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా గత ప్రభుత్వం ఈ సంస్థ నిర్వహణను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో దీని బాధ్యతను సంక్షేమ శాఖ చేపట్టింది. రెండేళ్ల నుంచి ఆ శాఖ ఆధీనంలోనే భూపాలపల్లి సఖి సెంటర్ నడుస్తోంది. అయితే... ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దానిని మళ్లీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో ఏడు స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వరంగల్‌కు చెందిన ఓరుగల్లు ఎన్‌జీవో, సహృదయ ట్రస్టు, కాటారానికి చెందిన సఖ్యత చారిటబుల్ ట్రస్టు, భూపాలపల్లికి చెందిన కేఎస్‌ఆర్ ట్రస్టు, అమృత వర్షిణి, హెచ్ఎంఆర్డీఎస్, ఏకే ఫౌండేషన్ సంస్థలు అర్జీలు పెట్టుకున్నాయి. వీటిలో ఒక దానికి త్వరలోనే సఖి సెంటర్ నిర్వహణ బాధ్యతను అప్పగించనున్నారు.

పైరవీల జోరు..

సఖి సెంటర్ నిర్వహణపై స్వచ్ఛంద సంస్థలు అత్యంత ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ఏడు దరఖాస్తుదారుల్లో ఎవరికి వారు పైరవీలు చేసుకుంటున్నట్లు సమాచారం. మంత్రులు, ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలోనే ఎంపిక ప్రక్రియలో ఆసల్యమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పాత వారిలో టెన్షన్

సఖి సెంటర్ నిర్వహణ ఎన్జీవోకు అప్పగిస్తుండటంతో ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. గతంలో వీరి నియామకంపై అసంతృప్తులు నెలకొన్నాయి. కొత్తగా ఎన్జీవో నియామకమైతే ఉద్యోగుల మార్పు చేర్పులకు ఆ స్వచ్ఛంద సంస్థకు అధికారం ఉంటుంది. దీంతో తమ పరిస్థితేమిటోననే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సెంటర్‌లో ఒక అడ్మినిస్ట్రేటర్, ఒక కౌన్సిలర్, ఒక కేస్ వర్కర్, ఇద్దరు సెక్యూరిటీ, ఇద్దరు మల్టీపర్పస్ అటెండర్లు.. మొత్తం ఏడుగురు ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ఇలానే కొనసాగుతారా.. లేక వీరి స్థానంలో కొత్త వారిని నియమిస్తారా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

ఖాళీ పోస్టుల భర్తీకి అవకాశం

భూపాలపల్లి సఖి కేంద్రంలో ప్రస్తుతం ఉద్యోగుల కొరత కూడా ఉంది. మొత్తం 13 మంది సిబ్బంది అవసరముండగా ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఎన్‌జీవో నియామకమైతే ఖాళీగా ఉన్న ఒక లీగల్ కౌన్సిలర్, ఒక కేస్ వర్కర్, రెండు ఏఎన్ఎంలు, ఒక ఆఫీసు అసిస్టెంట్, ఒక సెక్యూరిటీ గార్డు పోస్టుల భర్తీకి అవకాశం ఉంది. అయితే.. గతంలా కాకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేకంగా ఎంపిక పరీక్ష నిర్వహించి నియామకాలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అవకతవకలకు, అనర్హులకు ఆస్కారం లేకుండా పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

త్వరలోనే ఎన్జీవోను ఎంపిక చేస్తాం

- చెన్నయ్య, సంక్షేమ శాఖ జిల్లా అధికారి (భూపాలపల్లి)



సఖి సెంటర్ నిర్వహణకు ఎన్జీవోను నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానించాం. ఏడు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. త్వరలోనే ఎంపిక జరుగుతుంది. నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలు అప్పగిస్తాం.

తిరిగి వచ్చిన పెద్దపులి!



ఫైల్



పంబాపూర్ అడవుల్లో అటవీశాఖ అధికారులు గుర్తించిన పెద్దపులి పాదముద్రలు

- కిన్నెరసాని నుంచి పంబాపూర్ అడవుల్లోకి ప్రవేశం
- ముష్టిగింజలను సేకరిస్తూ గుర్తించిన గిరిజనుడు
- ములుగు అటవీ ప్రాంత పరిసరాల్లో భయం భయం

తాడ్వాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏజెన్సీ వాసులకు మూడురోజులుగా నిద్ర లేకుండా చేస్తున్న పెద్దపులి తాజాగా తాడ్వాయి మండలంలోకి ప్రవేశించింది. గురువారం పంబాపూర్ అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు నిర్ధారణ అయింది. గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు ముష్టిగింజల సేకరణ కోసం సమీప అడవికి తమ పెంపుడు కుక్కలతో కలిసి వెళ్లాడు. పులిని చూసిన కుక్కలు బిగ్గరగా అరిశాయి. భయంతో వణికిపోయిన ఆ వ్యక్తి పరుగున గ్రామానికి చేరుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు అడవిలోకి వెళ్లారు. పాదముద్రల ఆధారంగా పెద్దపులి వచ్చినట్లు నిర్ధారించుకున్నారు. 2021-22 సంవత్సరంలో ఇదే అడవిలో పెద్దపులి సంచరించింది. 2021లో అనూహ్యంగా వేటగాళ్ల ఉచ్చుకు ఓ ఆడపులి బలైంది. బుధవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలోకి వెళ్లిన పులి వెనక్కివచ్చి తాడ్వాయి అడవుల్లోకి ప్రవేశించింది. ట్రాప్ కెమెరాల ద్వారా కదలికలను అధికారులు గమనిస్తున్నారు. ఇప్పటికే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. జనావాసాల వైపునకు వచ్చే అవకాశం ఉండడంతో సమీప గ్రామాలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. అడవి సమీపంలోని పంట పొలాల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేపడానికి, అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లకూడదంటూ హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి సంచారంతో దామెరవాయి, పంబాపూర్ సహా ఆరు గ్రామాల ప్రజలు, గొత్తికోయగూడెం వాసులు భయంతో వణికిపోతున్నారు.

అడవుల్లోకి ప్రజలు వెళ్లొద్దు: డీఎఫ్‌వో

మంగపేట (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా మంగపేట అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్న ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయని, అటవీ ప్రాంతాల ప్రజలు అడవుల్లోకి వెళ్లవద్దని ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని గోదావరితీరంతోపాటు తిమ్మాపురం వాగుల్లో డీఎఫ్‌వో ఫారెస్ట్ సిబ్బందితో కలిసి పెద్దపులి తిరిగిన జాడలను అన్వేషించారు. తిమ్మాపురం వాగులో పులి పాదముద్రలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇటీవల పెద్దపులి సంచరిస్తున్న మాట వాస్తవమేనని, అడవుల్లో విచ్చలవిడిగా తిరగొద్దని ప్రజలకు సూచించారు.

ఇదేక్రమంలో పెద్దపులి ఉందని భయాందోళన చెందాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. ము లుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అటవీ ప్రాంతాల్లో పెద్దపులి తిరుగుతోందని గ్రామాల్లో చాటింపు వేయించినట్లు తెలిపారు. ఆయన వెంట మంగపేట ఫారెస్ట్ ఇన్‌చార్జి రేంజర్ అశోక్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ రషీద్, బీట్ ఆఫీసర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ములుగు కలెక్టర్ దివాకర



సామావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15,1 6తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షలను అధికారులందరూ సమష్టిగా కృషితో పకడ్బందీ నిర్వహించాలని కలెక్టర్ టీ.ఎస్.దివాకర అన్నారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్లు, పోలీస్ నోడల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డీవో, ఫ్లయింగ్ స్క్వాడ్లు, జాయింట్ రూట్ ఆఫీసర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద తగినంత పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి లా అండ్ ఆర్డర్ మెయింటైన్ చేయాలని, 144సెక్షన్ అమలు చేయాలని అన్నారు. పరీక్ష జరిగే సమయంలో జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, ట్రాఫిక్ వల్ల అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పరీక్ష జరిగే సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభ్యర్థుల కోసం తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద మందులు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 2,195 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలు రాయనున్నారని, వారి కోసం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, అదనపు ఎస్పీ సదానందం, ఆర్‌సీ మల్లేశం, ఏఆర్‌సీ బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల నిరసన



మోడల్‌స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కొరికిశాల మోడల్‌స్కూల్‌లో ఉపాధ్యాయులు గురువారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. 010 పద్దు ద్వారా ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు వేతనాలు అందించాలని, గత పీఆర్సీలో నష్టపోయిన వారికి నోషనల్ సర్వీస్ కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, జీవో 317ను అమలు పరిచి ప్రమోషన్లు చేపట్టాలని కోరారు.

చిట్యాలలో..

చిట్యాల, (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ స్థానిక మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.. గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు నీలం రవీందర్, ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు, సమీరా, వాణి, అయేషా, జోష్న, శివ, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీ కప్పులతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



ములుగులో టీ కప్పులతో నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె గురువారం మూడోరోజు కొనసాగాయి. ములుగులోని పోస్టాఫీస్ వద్ద జరిగిన దీక్షలో పలువురు పాల్గొన్నారు. ఆనాటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ టీ తాగినంత టైంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యను పరిష్కరించొచ్చని అన్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయడంతోపాటు కనీస వేతనం అమలుచేయాలని, ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.20లక్షలు, ఆరోగ్యబీమా రూ.10లక్షలు వర్తింపజేయాలని, పీటీఐలకు సమగ్ర ఉద్యోగుల్లా 12నెలల వేతనం అందించి విద్యాశాఖలో విలీనం చేయా లని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పిం చాలని, మరణించిన సమగ్రశిక్షా ఉద్యోగుల కుటుంబాల కు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈదీక్షలో సంఘం అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పొద్య కుమార్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, ఉపాధ్యక్షులు ఎమ్డీ.ఫిరోజ్, బి.విష్ణు, సహాయ కార్యదర్శులు వసంతలక్ష్మి, భరత్, సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు స్వాతి, ప్రవీణ్, చిరంజీవి, స్వాతి, స్వామి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




హోమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

కాటారం, డిసెంబరు 12: దత్తాత్రేయస్వామి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని ధన్వాడ గ్రామంలో శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు, దేవదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ దంపతులు హాజరయ్యారు. దత్తాత్రేయస్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు చేతులమీదుగా వేద పండితులు కృష్ణమోహన్, ప్రవీణ్, గణేష్, ఆశీష్, సుమిత్, సీతారాం రుద్రసహిత సుదర్శన హోమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఆకాంక్షతో దత్తాత్రయస్వామిని మొక్కుకు న్నామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చే యడానికి భగవంతుడి ఆశీర్వాదం తీసుకున్నానన్నారు. మహిళలు జయంతి వేడుకల్లో పాల్గొని 108 దివ్యజ్యోతులతో స్వామివారి ఊరేగింపు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు తల్లి జయశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. కాటారం, మహాదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాంచందర్‌రావు నేతృత్వంలో ఎస్సైలు అభినవ్, మహేందర్, థామస్‌రెడ్డి, పవన్, నరేష్‌లు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో పండుగలా డైట్ ప్రోగ్రాం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 12: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిరెడెన్షియల్, కేజీబీవీల్లో కొత్తగా నిర్వహించే డైట్ ప్రోగ్రాంను పండుగలా జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 14న నిర్వహించే నూతన డైట్ కార్యక్రమం ప్రారంభోత్సవంపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 61 వసతి గృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థుల తల్లులతోపాటు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు, అతిథులకు బగారా రైస్, చికెన్, మిల్‌మేకర్, సాంబార్, పెరుగు వంటి వంటకాలతో ప్రత్యేకంగా భోజనం వడ్డించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, సంక్షేమ శాఖల అధికారులు సునీత శైలజ, పోశం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



వీరస్వామి మృతదేహం

తాడ్వాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన సాదు వీరస్వామి(57) ఉదయం సమీపంలోని బంగారు కుంటకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. సమీప బంధువులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వీరస్వామి మృతదేహాన్ని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

చోరీ కేసులో జైలు శిక్ష

కాటారం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శకాలనీలో గత ఏడాది జరిగిన చోరీ కేసులో ఒకరికి 15 నెలల జైలు శిక్షను భూపాలపల్లి ఏజేఎఫ్‌ఎంసీ కోర్టు విధించిందని మ్యాక అభినవ్ గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదర్శనగర్ కాలనీలో ముస్కుల సురేందర్‌రెడ్డి, టీచర్ రేపాల వేణుగోపాల్ ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి 2023 అక్టోబరు 22-25వ తేదీల మధ్య దొంగతనాలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తి మంచిర్యాల జిల్లా నీల్వాయి గ్రామానికి చెందిన చింతకింది సతీష్‌గా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. కోర్టు పీసీ రాజేందర్ పలువురు సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమార్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో సతీష్‌కు ఒక ఏడాది మూడు నెలల జైలు శిక్షను ఏజేఎఫ్‌ఎంసీ మెజిస్ట్రేట్ అఖిల విధించారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సింగార్

వివరాలు 6వ పేజీలో...

చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు

వెంకటాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు, హక్కులను అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు అన్నారు. గురువారం మండలంలోని పాత్రాపురంలో చింత సోమరాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీ హక్కులు, చట్టాల కోసం త్యాగాలుచేసి సాధించు కున్న వాటిని అమలుచేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తుడుందెబ్బ మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు పొదెం రత్నం, వీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు

రఘునాథపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 36 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతోపాటు వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 36గ్రామ పంచాయతీల పరిధిలో 44,605 మంది ఓటర్లు ఉన్నారని, 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 13 లోపు తెలపాలని సూచించారు. 17న తుది పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇందుకు సహకరించాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : స్థానిక ఎన్నికల కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు మండలంలోని రాజకీయ నాయకులతో గురువారం ఎంపీడీవో నాగోశాద్రిసూరి సమావేశమయ్యారు. మండలంలో పెరిగిన పోలింగ్ బూత్‌ల సంఖ్య, పోలింగ్ బూత్‌లపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 14 లోగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొడకండ్లలో నాయకులతో సమావేశమైన అధికారులు

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుగులోత్ నర్సింహా కుమారుడు బిక్కున్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. గురువారం పెద్దతండా చేరుకుని బిక్కున్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. అలాగే రంబోజీగూడెం ఎర్రకుంట తండాకు చెందిన రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, నాయకులు రాంసింగ్, కొల్లూరి సోమయ్య, కోక్యానాయక్, భగవాన్, భాషా, వసిందర్, హేమ, చిన్న, నర్సింహా, రామల్, మోహన్, మంగు, నరేందర్, బిచ్యా, రాజన్న, భద్రు, రాజు, దిలీప్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న దయాకర్‌రావు

కళాక్షేత్రం పగుళ్లపై విచారణ జరిపించాలి

- కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, కేయూ విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం




కాళోజీ కళాక్షేత్రంలో పగుళ్లను పరిశీలిస్తున్న కుడా అధికారులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు వెచ్చించి.. నగరం నడిబొడ్డున ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. బీజేపీ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రాన్ని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేటుకు తాళం వేసి ఉంచడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి నెలరోజులు కాకముందే పగుళ్లు ఏర్పడటంపై కలెక్టర్ విచారణ జరిపించాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కళాక్షేత్రం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని, అందువల్లే గోడలకు పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. ఇక 'ఆంధ్రజ్యోతి' కథనంతో అప్రమత్తమైన కుడా అధికారులు కళాక్షేత్రం గోడలకు వచ్చిన పగుళ్లను పరిశీలించారు. ఇవి చిన్న చిన్న లోపాలని, ఇలాంటివి సహజంగానే జరుగుతాయని, దీన్ని పెద్దదిగా చేయడం సరికాదన్నారు. వెంటనే పగుళ్లకు మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే సుమారు రూ.95కోట్లు వెచ్చించి నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం విషయంలో నాణ్యత పాటించకపోవడమేంటన్న చర్చ సర్వత్రా జరిగింది.

అవి పగుళ్లు కాదు : జీడబ్ల్యూఎంసీ కమిషనర్

కాళోజీ కళాక్షేత్రం భవనం గోడలకు వచ్చినవి పగుళ్లు కాదని, ఎలివేషన్‌లోని రెండు జీఎఫ్ఆర్‌సీ పలకల మధ్య గ్యాప్ వచ్చిందని గ్రేటర్ వరంగల్ కమిషనర్, కుడా వైస్‌చైర్మన్ అశ్వినితానాజీ వాకడే బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై ఎఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ ఓ ప్రకటన చేశారు.

కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలోని 125 విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపించాలని, విద్యా సంస్థల ఆవరణలో శానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు.

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో ప్రతీ హాస్టల్‌కు ఒక అధికారిని నియమించి, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నర్సింహాస్వామి, సైదానాయక్, సుబ్బారావు, శ్రీనివాస్, హరిప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి శంకర్

వెంకటాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్ హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోని బండ్లపహాడ్‌లో గురువారం ఆయన అటవీశాఖ సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా 31 గొత్తికోయ నివాసాలను తనిఖీ చేసి అటవీ జంతువులను వేటాడే ఉచ్చులు, బాణాలు, చువ్వలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. అటవీ ప్రాణులను వేటాడడం నేరమని, అనుమానితులు ఎవరైనా అడవిలో సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని, ఇందుకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కలప అక్రమ రవాణా, ఇసుక రవాణా సమాచారం అందజేయాలని సూచించారు. కాగా, ములుగు జిల్లాలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవు తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యాకూబ్‌జాని, సెక్షన్ అధికారి రవీందర్, బీట్ అధికారులు రాజేశ్వరి, సుప్రియ, స్వర్ణల త, రూప్‌కుమార్, శివశంకర్, భద్రు, రాజేష్, హనుమంతు, శ్యామ్‌సుందర్, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితర లు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బాణాలను చూపుతున్న రేంజ్ అధికారి శంకర్

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2315	2080
పల్లికాయ (సూక)	4020	4000
పల్లికాయ (పచ్చిది)	4250	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	7100	5800
పసుపు (కాడి)	11111	11000
పసుపు (గోల)	11209	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15500	14000
వండర్ హాట్ ఏసీ	13000	11000
యూఎస్ 341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం


కృష్ణవేణిని సన్మానిస్తున్న జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

పారా త్రోబాల్ క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణికి సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామస్థురాలు మాచర్ల కృష్ణవేణి డిసెంబరు 5, 6, 7న కాంబోడియా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి భారతదేశానికి గోల్డ్‌మెడల్ తీసుకువచ్చింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కృష్ణవేణికి స్వీట్స్ తినిపించి శాలువాతో సత్కరించారు. జనగామ జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం సంతోషకరమైన విషయమని, ఇంటర్నేషినల్ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి దేశానికి, జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. రానున్న రోజుల్లో పారా ఒలంపిక్స్ పోటీలకు ఎంపికయ్యేలా సాధన చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా క్రీడల విభాగం అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సభ్యత్వాల సర్టిఫికెట్ల అందజేత



రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యత్వ సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ వరప్రసాద్

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖలో 2017-18 నుంచి శాశ్వత సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలు అందిస్తున్న వారికి సర్టిఫికెట్‌లను అందిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ చైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. గురువారం తొర్రూరులోని లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో సర్టిఫికెట్‌లు అందజేసి ఆయన మాట్లాడారు. ఇండియాలోని అన్ని నగరాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అందిస్తుందని, పేద ప్రజల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాట్రన్ సభ్యులు డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, టి.విశ్వేశ్వరరావు, యాదగిరి రెడ్డి, వీరభద్ర రావు, జి. వెంకన్న, సరేష్, రేగూరి వెంకన్న, డాక్టర్ రాం నర్సయ్య, కిరణ్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు


కేంద్ర మంత్రి జువల్‌ని సన్మానిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి జువల్ ఓరంకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో విద్యనభ్యసించే విద్యార్థులకు 500 మంది సామర్థ్యం గల వసతి గృహం అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వసతిగృహ భవన నిర్మాణం కోసం రూ.20 కోట్లు అవసరం ఉంటుందని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భీమునిపాదం జలపాతంను పర్యాటక కేంద్రంగా చేసేందుకు, గిరిజన యువత ఉపాధికొరకై సుమారు రూ.13 కోట్లతో అటవీశాఖ అధికారులతో ప్రణాళిక రూపొందించామని మంత్రికి వివరించినట్లు చెప్పారు. తద్వారా ఆప్రాంత గిరిజనులకు ఉపాధి లభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి కేంద్ర ప్రభుత్వం ద్వారా సత్వర సహకారం అందించనున్నట్లు వివరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ఇచ్చే రూ.750 ఉపకార వేతనాల కోసం అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని హుస్సేన్‌నాయక్ కేంద్రమంతికి విజ్ఞప్తి చేశారు.


రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మావన హక్కుల సంఘం సభ్యులు

వైబ్రెంట్ విద్యా సంస్థల అధినేత రాజేందర్‌రెడ్డికి సన్మానం

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా తన బోధనల ద్వారా విద్యాసంస్థలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన వైబ్రెంట్ విద్యాసంస్థల అధినేత చిట్టిరెడ్డి రాజేందర్‌రెడ్డి సేవలను గుర్తించి మానవహక్కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ గార్డెన్‌లో రాజేందర్‌రెడ్డి దంపతులకు శాలువా కప్పి భారత సేవారత్న బిరుదును బహూకరించి ఘనంగా సన్మానించారు. రాజేందర్‌రెడ్డి 2019లో మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు సేవ చేసినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సన్మానం చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజు (ఫైల్)

సంగెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిచర్ల గ్రామంలో జరిగిన పెళ్లిలో పాల్గొని తిరిగి స్వగ్రామం వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంగెం పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన నీరటి రాజు, గుండా సురేష్, కుక్కల పవన్‌లు ఈనెల 7న గవిచర్ల గ్రామంలో జరిగే పెళ్లికి బైక్‌పై ముగ్గురు వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. అదే రోజు రాత్రి 11 గంటలకు వెళుతుండగా మండలంలోని ఆశాలపల్లి- కాపులకనపర్తి గ్రామాల మధ్యన గల ఓ రైస్‌మిల్లు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. వాహనం నడుపుతున్న నీరటి రాజు(23)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎంకు తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

యువకుడు ఆత్మహత్య


భరత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని నందినగర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందినగర్‌కు చెందిన భట్టు సుజాత-రమేష్ దంపతులకు ముగ్గురు కుమారుల్లో రెండోవాడు భరత్ (25) జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. భరత్ మృతి చెందాడు. మృతుడికి తల్లి సుజాత, ఇద్దరు సోదరులు ఉన్నారు.

నలుగురు కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై వివరణ ఇవ్వాలని నాలుగు జిల్లాల కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో ఎందుకు కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించింది. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గతేడాది విచారణ జరిగింది. ఇది పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది.

ఏడాది దాటినా పరిహారం చెల్లించకపోవడంపై కొండల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు- యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఎందుకు స్వీకరించరాదో వివరణ ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

నెహ్రూసెంటర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రముఖ పర్యాటక కేంద్రాలైన కాశీవిశ్వనాథ్, విశాలక్ష్మి అన్నపూర్ణదేవి, శ్రీరామజన్మభూమి, హనుమాన్‌గిరి అయోధ్యలో జరిగే కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 19న ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్ మీదుగా సాయంత్రం 4 గంటలకు మహబూబాబాద్ స్టేషన్‌కు చేరుకుంటున్నట్లు చెప్పారు. డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ మీదుగా టూరిజం ప్రాంతాలకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రత్యేక రైలులో ప్రయాణికులకు సౌకర్యార్థంగా ప్రత్యేక గదులు, ఏసీ, నాన్ ఏసీ సౌకర్యాలతోపాటు క్యాటరింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతీ 75 మందికి టీం లీడర్‌లు మేనేజ్‌మెంట్ చేస్తారని చెప్పారు. పూర్తి సమాచారం కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism.comను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ : 971260701, 9287030711లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్‌చార్జి నరేష్, టూరిజం మెంబర్ ప్రశాంత్ పాల్గొన్నారు.


మానుకోటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్

ఆంధ్రజ్యోతి Classifieds

LAND FOR SALE
హనుమకొండ-ఖమ్మం హైవే 230 ఫీట్ ఫేసింగ్ తో 5200 గజాల భూమి ఆకేరు వాగు (వర్ధన్నపేట) దగ్గరలో లక్ష్మి గార్డెన్స్ ప్రక్కన కాంపౌండ్ వాల్ కట్టి వాలా అనుమతి తో అమ్మకానికి కలదు. వివరాలకు
Cont : 9705469885, 9705469886

WANTED
★ మొబైల్ టెక్నీషన్/ సెల్స్ పర్సన్స్ (With/with out) Experience. Good Salary + Insentives. Teja Mobiles Hnk. Cont : 7673946689
AJW-199490

WANTED
★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సం॥ప్ర॥ 8247771016, 8247771525
AJW-4024

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. సం॥ప్ర॥ 9849145043, 9866584455
AJW-199469

REAL ESTAE
★ డబ్బులు లేకుండా TDR ఇవ్వబడును బదులుగా మీ వద్ద ఉన్న Flats (or) Open Lands తీసుకోబడును (ఖరీదు చేయబడును) సం॥ప్ర॥ 9885301652
AJW-7628

అడ్మిషన్లు జరుగుచున్నవి
★ DOA, DOM DML DRGA అడ్మిషన్లు జరుగుచున్నవి మరియు కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ స్కాలర్‌షిప్ వర్క్ చేయడానికి కావలెను. సం॥ప్ర॥ 9177631014
AJW-199491

పాస్‌పోర్ట్ పోయినది
★ రుద్రాంగి శ్రీనివాస్, తండ్రి : విశ్వనాథం, H.No: 2-4-605/1, రాంనగర్, హన్మకొండ గారికి సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం : K555109 గలది హన్మకొండ ఓల్డ్ బస్ డిపో నుండి కలెక్టర్ ఆఫీస్‌కు ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు సం॥ప్ర॥ 9949648175
AJW-226285

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

3+2 స్కీం కలదు



జీవవైవిధ్యాలు.. పులి మడుగు

ప్రకృతి సోయగం

గూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే జలపాతం.. పచ్చని ప్రకృతి అందాలతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి చారిత్రక పులిమడుగు గుట్టలు. ఒకప్పుడు పులులకు ఆవాసంగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు పలు వన్యప్రాణులున్నాయి. ఎలుగుబంట్లు, జింకలు, కనుజు, మూషికజింక, చుక్కల దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, నెమళ్లు, ఇతరత్ర వన్య ప్రాణులతో పాటు పశుపక్ష్యాదులు, ఔషధ గుణాలు కలిగిన చెట్లు ఇక్కడి ప్రత్యేకం. మహబూబాబాద్ జిల్లాలో 1.50లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న పులి మడుగు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. తాజాగా, ప్రకృతి పర్యాటక కేంద్రంగా సర్కార్ గుర్తించడంతో పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందబోతోందని అధికారులు చెకబుతుండగా.. పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్, బోటింగ్, ఉండడానికి వసతి సౌకర్యాలను కల్పిస్తే బావుంటుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

12 ప్రకృతి సర్క్యూట్లలో ఒకటి..

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అటవీ, అటవీ ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 సర్క్యూట్‌లను అధికారులు గుర్తించారు.

వీటిలో భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు రేంజ్ పరిధిలోని పులిమడుగు అటవీప్రాంతాన్ని చేర్చారు. పులిమడుగు ప్రాంతం వన్యప్రాణుల ఆవాసానికి అనువుగా ఉంటుంది. ఇక్కడి దట్టమైన అడవిలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, విశాలమైన గడ్డి మైదానాలు, రాళ్ల గుట్టలు, గుహలు వాటి ఆవాసానికి అనుకూలంగా ఉంటాయి.

పులిమడుగులో క్యాంపెయిన్ సైట్..

గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం సరిహద్దుల్లో ఉన్న ఈ పులిమడుగులో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.18 లక్షల నిధులతో క్యాంపెయిన్ సైట్, సోలార్ బోరు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు.

గూడూరు రేంజ్ పరిధిలోని మట్టేవాడ శివారు కొంగరిగిద్ద నుంచి కొడిశలమిట్ట సమీపంలో పులిమడుగు ప్రాంతం ఉంది. అక్కడి వరకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి పులిమడుగుకు చేరుకోవాలంటే కేవలం 40 కిలోమీటర్లు ఉంటుంది. హనుమకొండ, గూడూరు మీదుగా పులిమడుగు వరకు సుమారు 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇప్పటికే అరకొరగా ఉన్న సౌకర్యాలతోనే పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు. కొంగరిగిద్ద నుంచి పులి మడుగు వరకు రోడ్డు సౌకర్యం, సఫారి, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్ బోటింగ్ లాంటి సౌకర్యాలు కల్పిస్తే పులి మడుగుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం నుంచి పర్యాటకులు వస్తారని, తద్వారా అటవీశాఖకు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పులిమడుగు పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం గతంలో కంప అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ, అడిషనల్ పీసీసీఎస్ ఫర్గీన్, భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమా నాయక్, అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక, డీఎఫ్‌వో రవికిరణ్, ప్రస్తుత డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, వరంగల్ డీఎఫ్‌వో అపర్ణలు సందర్శించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

- విశాలమైన అడవులకు నెలవు
- వన్యప్రాణుల మనుగడకు అనువైన ప్రాంతం
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
- అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ



పులి మడుగులో బోటింగ్ చేస్తున్న అటవీ శాఖాధికారులు



పులిమడుగులో క్యాంపెయినింగ్ సైట్‌ను ప్రారంభిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు (ఫైల్)



పులిమడుగులో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు, గూడూరు



గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో ఉన్న పులిమడుగు అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. కొంగరిగిద్ద నుంచి పులిమడుగు వరకు రహదారిని ఏర్పాటు చేయాలి. పర్యాటకులకు ట్రెక్కింగ్, బర్డ్‌వాచ్, సఫారీ, బోటింగ్, వసతి సౌకర్యం కల్పించాలి. పులిమడుగులో పర్యాటకుల సందడి పెరిగితే అటవీశాఖకు ఆదాయం సమకూరనుంది.

పులిమడుగు జీవ వైవిధ్యానికి కేంద్రం
ఎఫ్ఆర్వో , మహబూబాబాద్ జిల్లా



పులిమడుగులోని పచ్చని వాతావరణం సకల ప్రాణుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో నీటిఊటలు, వాగులు, వంకలు, అరుదైన వృక్షశిలాజాలు ఉన్నాయి. ఇది శాకాహార జంతువులతో పాటు క్రూర జంతువులకు కూడా ఆవాసంగా ఉంది. పులిమడుగును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే పులిమడుగులో క్యాంపెయిన్ సైట్, నీటికుంటలు, సోలార్ బోర్‌ను ఏర్పాటు చేశాం.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్ మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి హెచ్ఐవీ, ఎయిడ్స్ క్విజ్ పోటీలలో హనుమకొండ జిల్లా విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. ఈ కాంపిటీషన్‌లో విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా బహుమతిలో భాగంగా రూ.20వేల నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు. విజేతలను, తోడ్పాటు అందించిన మేనేజర్ స్వప్న మాధురిలను హనుమకొండ డీఎంహెచ్ఓ ఏ.అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు



ములుగురోడ్‌లోని సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువుదీరిన దత్తాత్రేయుడు

గురువులకే గురువు.. గురుదత్తుడు

- 15న దత్త జయంతి.. వేడుకలకు దత్తక్షేత్రంలో ఏర్పాట్లు
- పౌర్ణమి హోమం, అన్నప్రసాద వితరణ
- భక్తులతో 54 సార్లు దత్తస్థవ పారాయణం

ఆధ్యాత్మికం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆది గురువు గురువులకే గురువు.. అత్రి అనసూయ మాతల పుత్రుడు దత్తాత్రేయుడు. యోగా మూర్తిగా నిరంతరం భక్తులను అనుగ్రహించే దత్తుడి జయంతి రోజైన ఈ నెల 15న వరంగల్ ఉమ్మడి జిల్లాలో దత్తాలయాల్లో, సాయిబాబా దేవాలయాల్లో గురు పరంపరల ఆశ్రమాలలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్గశిర మాసం కృత్తికా నక్షత్రం పౌర్ణమి రోజున దత్తాత్రేయ స్వామి జన్మదినం సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అలంకరణలు, భజనలు, హారతులు, అన్నదానాలు నిర్వహించడానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

తైలంతో అభిషేకం విశేష ఫలం

దత్తాత్రేయ స్వామికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహిస్తే విశేష అనుగ్రహం కలుగుతుందని, మంచి జరగడం కోసం, అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవడం కోసం పౌర్ణమి రోజున నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ తైలంతో దత్తాత్రేయ స్వామికి అభిషేకం చేయాలని, దాంతో విశేషఫలం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. దత్తా.. దత్తా.. అని స్మరణ చేస్తే సంతుష్టుడయ్యే మూర్తి గా దత్తాత్రేయుడిని ఆరాధిస్తారు. స్వామికి భజనలు, నామస్మరణలంటే ప్రీతి. గురు పరంపరలో ఆది గురువుగా ప్రసిద్ధికెక్కిన అవదూతగా దత్తాత్రేయస్వామిని గురువుగా కొలుస్తారు.

దత్తక్షేత్రంలో వేడుకలు

రాష్ట్రంలోనే స్థిరమూర్తిగా కూర్చొని ఉన్న దత్తాత్రేయస్వామి ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువు దీరాడు. ఏటా దత్తజయంతి రోజున ఇక్కడ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో తైలాభిషేకాలు, హోమంతో పాటు 54 సార్లు శ్రీదత్తస్థవ పారాయణంనిర్వహిస్తారు. మహా అన్నప్రసాద వితరణను కూడా ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని సాయిబాబా దేవాలయాలు, గురు ఆశ్రమాల్లో 15న దత్త జయంతి వేడుకలు, హారతులు, అన్నదానం, హోమాలు, అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నారుమడికి జెండా అండ



పక్షుల నుంచి నారుమడిని కాపాడుకనేందుకు పార్టీ జెండాలను ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు ఓ రైతు. కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి శివారులో మహబూబాబాద్ వెళ్లే రహదారి వెంట ఓ నారుమడికి నాలుగువైపులా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడో రైతు. స్వతహాగా కాంగ్రెస్ అభిమాని అయిన సదరు రైతు.. తనకే కాదు నారుమడికి కూడా అభయ 'హస్తం' అన్నట్టుగా పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడంటూ దారినపోయేవారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

బహుముఖ ప్రజ్ఞాశాలి.. వలస పైడి





మన టీవీ, యూ ట్యూబ్‌లో పాఠాలు బోధిస్తున్న పైడి

- వ్యాఖ్యాతగా, కవిగా రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- అర్ధాంగి జ్ఞాపకాలతో 'మాఇంటి బతుకమ్మ' పుస్తక ప్రచురణ
- విద్యాశాఖ, పలు ప్రభుత్వ కార్యక్రమాలకూ సమన్వయకర్త

కీర్తి పతాక

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయన భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు. సమాజాన్ని నిర్దేశించే సామాజిక సాహితీవేత్త. టీచర్ వృత్తిలో కొనసాగుతూనే దూరదర్శన్ విద్యా సంబంధ కార్యక్రమాలు, ఆకాశవాణిలో పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, సాహితీ కార్యక్రమాలకు సమన్వయకర్తగా, నాటకాల్లో పాత్రధారిగా, కవిగా, రచయితగా బహుముఖ రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఆయనే హనుమకొండ జిల్లా కేంద్రంలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వలస పైడి. కరోనా సమయంలో పైడి పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 72 పాఠాలను రూపొందించి బోధించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల పక్కనున్న శ్రీరాములపల్లిలో వలస ఉప్పలయ్య, కట్టమ్మ దంపతులకు జన్మించిన పైడి అక్కడి ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, అంబాల జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి టెన్త్ వరకు పూర్తి చేశారు. ఆరో తరగతిలోనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న పైడి.. శ్రీరాములపల్లిలోని భజన మండలి ప్రదర్శించే నాటకాలకు సాహిత్యం అందించారు. అంతేకాదు ఆరో తరగతిలోనే లవకుశ నాటకంలో రైతు పాత్ర వేశారు. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, కడప జిల్లా లోని ప్రొద్దుటూర్‌లో ఉపాధ్యాయ పండిత శిక్షణ అనంతరం 1996లో వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.

11 పుస్తకాల రచన

వలస పైడి వ్యాఖ్యాతగానే కాకుండా కవి, రచయిత గాను ఖ్యాతిగడిస్తు న్నాడు. సామాజిక స్పృహ కలిగిన కవిగా రాణిస్తూ 11 పుస్తకాలను ఆయన రచించారు. తన అర్ధాంగి సునీత మరణించగా ఆమె గుర్తులను 'మా ఇంటి బతుకమ్మ'గా పదిలపరుచుకున్నారు. 'ఆచార్య దేవోభవ' పేరుతో 5 బాలల నాటికలను పుస్తకంగా రచించారు. 'మా పల్లె పచ్చబడ్డది' అనే సైన్స్ నేపథ్యంతో ఉన్న నాటికి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శింపబడింది. 'ఆకురాలిన వసంతం' అనే పరిశోధానత్మక పుస్తకంతో పాటు 'మా నాయిన' అనే గేయ కవిత్వం, 'కొత్త పొద్దు', 'తెలంగాణ జయ కేతనం' పేరుతో తెలంగాణ ఆవిర్భావం సందర్భం పై పుస్తకాలు రాశారు. ఇలా సాహిత్యంలోని అన్ని కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

విద్యా శాఖ కార్యక్రమాలకు ఆయనే వ్యాఖ్యాత

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా వ్యాఖ్యాతగా వలస పైడి ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. 1997లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేసిన పైడి వేలాది కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

టీశాట్ (మన టీవీ)లో లైవ్ లెసన్ ప్రజెంటర్‌గా పనిచేశారు. ఇవే కాకుండా ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి కాకతీయ ఉత్సవాలు, ఓరుగల్లు కళావైభవాలు కార్యక్రమాలకు వ్యాఖ్యానం అందించారు. జిల్లాలో నిర్వహించే వివిధ సాహితీ సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, ఉగాది పండుగ వేళ దూరదర్శన్‌లో నిర్వహించే కవి సమ్మేళనానికి, వేయి స్తంభాల గుడిలో నిర్వహించే కవి సమ్మేళనాలకు వలస పైడియే వ్యాఖ్యాతగా ఉంటారు.

వరంగల్ ఆకాశవాణిలో డాక్టర్ అంపశయ్య నవీన్ రాసిన బాంధవ్యాలు అనే నాటికను 18 ధారావాహికాల్లో ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి వ్యాఖ్యానం చేశారు. అలాగే 42 ధారావాహికాల్లో 101 బాలల కోసం భారత కథలు వ్యాఖ్యానం చేశారు. అలాగే అనేక నాటకాల్లో వివిధ పాత్రలకు ఆయన ప్రాణం పోశారు.

సీఎంలు, మంత్రుల కార్యక్రమాలకు..

జిల్లాకు వచ్చే ముఖ్యమంత్రులు, మంత్రుల కార్యక్రమాలకు పైడినే అధికారులు వ్యాఖ్యాతగా ఎంచుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ములుగు రాయినిగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యాఖ్యానం చేశారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో నర్సంపేటలో నిర్వహించిన గ్రామజ్యోతి కార్యక్రమానికి పైడినే వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అవార్డులెన్నో...

2017లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం పొందారు. రెండు సార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవాన్ని దక్కించుకున్నారు. ఢిల్లీలో దళిత సాహిత్య అకాడమీ వారి ఉత్తమ కవిగా అవార్డు అందుకున్నారు. లయన్స్, రోటరీ క్లబ్‌ల నేషనల్ బిల్డర్ అవార్డు పొందడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి వలస పైడి అనేక మార్లు సత్కారాలు అందుకున్నారు.



అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు తీసుకుంటున్న పైడి

ఎల్డర్ లైన్ 14567

- ఆదరణకు నోచుకోని వృద్ధుల కోసం ఫోన్‌నెంబర్
- తక్షణమే సాయం అందించేలా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రెవెన్యూ డివిజన్లు, జిల్లాల స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునళ్లు
- వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలుకు విభాగం ఏర్పాటు

మీ కోసం

బాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిలో కుటుంబంలోని పెద్దల పట్ల ఎంతో గౌరవం ఉండేది. కానీ సామాజికంగా, ఆర్థికంగా వస్తున్న మార్పుల కారణంగా ఆ గౌరవం సన్నగిల్లుతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై కుటుంబం అంటే భార్య, భర్త, పిల్లలు మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. చివరకు తమను పెంచిపెద్ద చేసిన.. ప్రయోజకులను చేసిన అత్తామామ, తల్లిదండ్రులకు వారింట్లో స్థానంలేకుండా పోయింది. ఫలితంగా ఆ తల్లిదండ్రులు చరమాంకంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. నేటి సమాజంలో చాలా మంది వయోవృద్ధులు తమ పిల్లల నుంచి సరైన ఆదరణకు నోచుకోక.. ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, దూషణలు, ఎన్నో అవమానాలు భరిస్తూ బతుకుతున్నారు. ఇక జీవిత భాగస్వామిని కోల్పోయిన, సంతానం లేని వృద్ధుల పరిస్థితి అయితే ఇంకా దారుణంగా ఉంటోంది. అలాంటి వృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. చట్టాలను అమలు చేస్తున్నాయి. రాజ్యాంగంలో వయో వృద్ధులకు కూడా ప్రాథమిక హక్కులున్నాయి. హిందూ దత్తత పోషణ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానంపైనే ఉంటుంది. అంతేగాక తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో పిల్లల నిరాధరణకు గురైనప్పుడు చట్టం ద్వారా ప్రభుత్వం వారి పోషణకు అయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తోంది.



వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రభుత్వ శాఖ

చట్టంపై అవగాహన లేకపోవడం, చట్టం నిబంధనల గురించి తెలియకపోవడంతో వయో వృద్ధులు ఎన్నోసమస్యలతో నిస్సహాయంగా బాధపడుతున్నారు. 2007లో రూపొందించిన తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2011లో నియమావళి రూపొంది అమలులోకి వచ్చింది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసింది. వయో వృద్ధుల వ్యధను తీర్చేందుకు, గౌరవంగా జీవించేందుకు అవసరమైన ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ఆ విభాగం ప్రధాన కర్తవ్యం. మారుమూల పల్లెల్లో నివసిస్తున్న వయో వృద్ధులకు చట్టం గురించి తగు అవగాహన కల్పించి అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉంటుంది.


ఎల్డర్ లైన్, ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు

నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధుల పరిస్థితులను చక్క దిద్దేందుకు వారికి అవసరమైన సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, బలవర్ధకమైన ఆహారం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆసరా పింఛన్, ఆరోగ్య శ్రీ లాంటి పథకాలను అమలు చేస్తోంది. బాధితులైన వయో వృద్ధులకు త్వరితగతిన న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రెవెన్యూ డివిజన్లలో ట్రిబ్యూనళ్లను, జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యూనళ్లను ఏర్పాటు చేసింది. అంతేగాక బాధిత వృద్ధులకు సత్వరం సులభంగా సహాయం అందించడానికి ప్రత్యేకమైన ఉచిత సహాయక ఫోన్ నంబర్ 14567 (ఎల్డర్‌లైన్)ను ఏర్పాటు చేసింది. సాధారణంగా తల్లిదండ్రులు వృద్ధాప్య దశకు చేరుకున్నాక తమ పేరున ఉన్న స్థిరాస్థులను తమ పిల్లల పేరున మార్పిడి చేస్తారు. ఆస్తి మార్పిడి అయ్యాక కొంత కాలానికి పిల్లలు తమ తల్లిదండ్రుల పోషణ, బాగోగులను పట్టించుకోకుండా నిర్దయగా ప్రవర్తిస్తే విధిలేని పరిస్థితుల్లో వారు ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. ఎల్డర్‌లైన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించినా లేదా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి సమస్యను విన్నవించుకున్నా పరిష్కరించి తగిన న్యాయం చేస్తారు. పిల్లల పేరున బదిలీ చేసిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున మార్పిడి చేస్తారు. ఇది ఆస్తిని అనుభవించే వారసులందరికీ చట్టం వర్తిస్తోంది.

వృద్ధుల సంక్షేమం కోసం సంఘం ..

వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగానే కాకుండా స్వచ్ఛందంగా సేవలందించేందుకు సామాజిక స్పృహకలిగిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ముందుకొచ్చారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అధ్యక్షుడిగా.. తేరాల యుగంధర్ ప్రధాన కార్యదర్శిగా సుమారు 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు కలిసి హనుమకొండ జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. తమవంతు కర్తవ్యంగా నగరంలోని రోడ్లవెంట చలిలో వణుకుతున్న అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ సహకారంతో కంటి చికిత్స శిబిరాలు, డీఎంహెచ్‌వో, ఆయుష్ డిపార్ట్‌మెంట్ సహకారం తో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వృద్ధులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలంటూ సంక్షేమ సంఘం నాయకులు చేసిన కృషి ఫలితంగానే ప్రత్యేక ఓపీ ని ఏర్పాటు చేశారు. అంతేగాక సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధుల సౌకర్యార్థం చట్టపరంగా ప్రతీ పోలీసు స్టేషన్‌లో వృద్ధమిత్ర కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

వృద్ధులు పనికిరాని వారు కాదు..



వృద్ధులను పనికి రాని వారుగా పరిగణించవద్దు. జీవితంలో వారు గడించిన అనుభవాలు ఎన్నో ఉంటాయి. అంతేగాక జ్ఞాన సంపన్నులై ఉంటారు. సమాజం వారి సేవలను ఉపయోగించుకోవాలి. రిటైర్ అయిన ఉద్యోగులంతా తమ ఉన్నతికి అవకాశం కల్పించిన సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం శాయశక్తుల కృషి చేయాలి.

దామెర నర్సయ్య, రిటైర్డ్ డీఎస్పీ, వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యూస్ రీల్

గణపసముద్రం తైబందీ ఖరారు

గణపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గణపసముద్రం తైబందీ గురువారం ఖరారైంది. అధికారులు, రైతులు గురువారం సమావేశమై ఈ సందర్భంగా గణపసముద్రం శివారు పారకమైన కోటకాల్వ నీటి సాగుదల కింద 400 ఎకరాలు, మత్తడి కాల్వ శివారులో 550ఎకరాలు, కొత్త కాల్వ నీటి పారుదల కింద 400 ఎకరాలను యాసంగి సాగుకు తైబందీ నిర్ణయించినట్లు నీటి పారుదల ఈఈ బసవ ప్రసాద్ తెలిపారు. సంబంధిత సాగు శివారు రైతులు మాత్రమే యాసంగి వరి పంట వేసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఏఈలు సమ్మారావు, మహేందర్, శ్రీనివాస్, ఆర్‌ఐలు దేవేందర్, రైతులు తదితరులు ఉన్నారు.

రామప్పను సందర్శించిన వియత్నాం దేశస్థులు


రామప్ప ఆలయంలో విదేశీయులు

వెంకటాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేటలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అదుర్స్ అని వియ త్నాం దేశానికి చెందిన లీ, యాన్‌లు అన్నారు. గురువారం వారు దేవాల యాన్ని సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్ విజయ్‌కుమార్ ద్వారా తెలుసుకున్నారు. రామప్ప దేవాలయం అమేజింగ్‌గా ఉందని కొనియాడారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేశారు.

సోమ రాజన్నను స్ఫూర్తిగా తీసుకోవాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన సోమరాజన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య అన్నారు. ములుగు మండలంలోని మల్లంపల్లిలో సోమరాజన్న వర్ధంతి సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చంద్రయ్య పూలమాల వేసి నివా ళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు ఎన్ని కుట్రలు చేసినా సోమరాజన్న మొక్కవోని ధైర్యంతో ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, శ్రీనాథ్, చంద్రు నాయక్, రాసర్ల చంద్రమౌళి, కామ రవి, కొమురక్క, ఐలయ్య, వెంకన్న, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వెంకటాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిర సబ్ సెంటర్‌లో సిబ్బంది గురువారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా సికిల్‌సెల్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడంతోపాటు అబా ఐడీకార్డు ఆన్‌లైన్ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్, ఆశిష్, జ్యోతి, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలపై సమీక్ష

మంగపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా 25 గ్రామ పంచాయతీల్లోని 230 ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లలో అభ్యర్థులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్ ఐదు అంశాలపై చర్చించి సూచనలు తీసుకున్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీవో కిషోర్ పాల్గొన్నారు.

పోచాపూర్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తాడ్వాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచాపూర్‌లో స్థానిక సంఘ కాపరి ఈసం అబ్రహం ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఉపసర్పంచ్ యాప మోహన్‌రావు, కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు మంకిడి ప్రశాంత్‌లు కేక్ కట్‌చేసి పలువురికి పంచారు. అనంతరం నిరుపేదలకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారోబార్ కుర్సం రమేష్, పాస్టర్లు లైదల జ్యోతిప్రవీణ్‌కుమార్, జోసెఫ్, నోవాహు, రాబర్ట్ రమేష్, యెమీమా కరుణమ్మ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి: ఏబీవీపీ

చిట్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 23 నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బండ సన్నీ, బుర్ర అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని చికెన్‌పల్లిలో భూలక్ష్మి (బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠాప కార్యక్రమ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భూలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు తన వంతుగా సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైట్ ప్రోగ్రాంను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

ములుగు కలెక్టర్ దివాకర


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల్లో ఈనెల 14న నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు డైట్‌చార్జీలు పెంచిన నేపథ్యంలో ఈనెల 14న జిల్లాలోని 84 వసతిగృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం గురుకుల విద్యార్థుల కోసం పౌష్టికా హారాన్ని అందిస్తోందని అన్నారు. విద్యార్థుల తల్లులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి వారి సమక్షంలో వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులను ప్రత్యే కంగా ఆహ్వానించాలని సూచించారు. వంటశాలలు, పరిసరాలు పరి శుభ్రంగా ఉంచాలని, మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈసమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు రిటైర్ట్ కార్మికుల ఖాతాల్లోకి లాభాల వాటా

కాకతీయఖని, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు యాజమాన్యం లాభాల వాటాను చెల్లించనుంది. భూపాలపల్లి ఏరియాలోని 209 మంది రిటైర్డ్ కార్మికులకు సుమారు రూ. 3కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమ కానున్నాయి. ఈమేరకు ఏరియా సింగరేణి అధికారులు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో పని చేసి దిగిపోయిన కార్మికులకు రూ. 33 కోట్లు యాజమాన్యం చెల్లించనుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామసమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్సవానిగూడెం గ్రామానికి చెందిన తుర్స వంశీ, కోయబెస్తగూడెంనకు చెందిన తుర్స నవీన్, వీరాపురం గ్రామానికి చెందిన నల్లబోయిన శరత్‌లు ద్విచక్రవాహనంపై తుర్సవానిగూడెం నుంచి మండల కేంద్రానికి వస్తున్నారు. ఈక్రమంలో వీరాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, నవీన్, వంశీలకు మెరుగైన వైద్యం అందించేందుకు ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

మంగపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ములుగు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సంపత్‌రావు గురువారం పరిశీలించారు. మండలంలోని కమలాపురం, రాజుపేట, కోమటిపల్లి, తదితర గ్రామాల్లో సర్వే చేస్తున్న బృందాల పనితీరును పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సక్రమంగా సర్వే చేపట్టాలని బృందాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మండల పంచాయతీ అధికారి కిషోర్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి

భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి


ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి

కాటారం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్లాంటేషన్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, పటిష్ఠ చర్యలు చేపట్టి అడవుల అభివృద్ధికి కృషి చేయాలని అటవీ అధికారులను భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి సెక్షన్ పరిధిలోని మేడిపల్లి సమీపంలోని అడవుల్లో గురువారం డీఎఫ్‌వో అటవీ అధికారులతో కలిసి పర్యటించారు. ప్లాంటేషన్లు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. క్యాలెండర్ ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంటేషన్లలో మొక్కలు బాగా ఎదిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎఫ్ఆర్వో నరేష్, ఎఫ్ఎస్‌వో సంతోష్, ఎఫ్‌బీవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకోవాలని, వన్యప్రాణులపై దాడి చేయొద్దని మహదేవపూర్ మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో గురువారం అటవీశాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహదేవపూర్ మండలం కుదురుపల్లిలో ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు ర్యాలీ తీశారు. వన్యప్రాణులపై దాడి చేస్తే చట్టరీత్యా చర్యలు చేపడుతామని సూచించారు. అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకు పెను ముప్పు ఉంటుందని వివరించారు ఈ కార్యక్రమంలో పలువురు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పరిధిలో సీఎస్‌ఈల ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో వాల్యానాయక్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 12: జిల్లాలోని పీఏసీఎస్‌ల పరిధిలో సీఎస్‌ఈలను ఏర్పాటు చేస్తున్నట్లు డీసీవో వాల్యానాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పీఏసీఎస్‌ల నిర్వాహకులతో సమావేశమై ఆయన పీఏసీఎస్‌ల పరిధిలో సీఎస్‌ఈల ఏర్పాటుపై సమీక్షించారు. డీసీవో మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో ఏర్పాటు చేస్తున్న సీఎస్‌ఈల్లో 27 సేవలు ప్రజలకు అందుబాటులోకి తెనున్నట్లు తెలిపారు. ఈసేవలను రైతులు, ప్రజలు వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో సీఎస్‌ఈ జిల్లా మేనేజర్ మాధురి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రాజు, నాగనారాయణ పాల్గొన్నారు.

ఆదిముక్తీశ్వర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం మహాదేవ వేద పాఠశాల (అచ్చులాపూర్) ప్రధాన అధ్యాపకులు దుద్దిళ్ల మనోహరశర్మ అవధాని ఆధ్వ ర్యంలో గురువారం జరిగింది. ఉదయం 6.30 గంటల నుంచి మండప దేవత పూజలు, పీఠ దేవత సహిత గర్తన్యాసం, బేజన్యాసం పూజలు జరిగాయి. ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిగాయి. శాంతి పౌష్టిక హోమాలు, జయాదుల బలి ప్రదానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, హారతి మంత్ర పుష్పాలు, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణను నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ కార్యనిర్వహణా ధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, గ్రామస్థులు, భక్తులు, అర్చకులు, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠకు సహకరించిన దాతలు రాంపట్ల ప్రశాంత్‌కుమార్ దంపతులు, చకిలం దయాకర్‌రావు దంపతులు, ఎ.శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు.

దళితబంధు సాధన సమితి పోస్టుకార్డుల ఉద్యమం

కాటారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దళితబంధు సాధనసమితి ఆధ్వర్యంలో గురువారం పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. సాధనసమితి జిల్లా అధ్యక్షుడు నముండ్ల సంపత్ ఆధ్వర్యంలో ఉప తపాలా అధికారి కార్యాలయం వద్ద గల పోస్ట్ బాక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ పేరిట రాసిన ఉత్తరాలను వేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించగా ఫ్రీజ్ చేసిన రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, బీసీ బంధు నిధులు పెంచుతూ పథకాన్ని కొనసాగించాలని, అర్హులైన వికలాంగులకు ఉపాధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలనే డిమాండ్లతో కూడిన కార్డులను పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు పంతకాని సడువలి, నార రమేష్, ఆత్కూరి శంకర్, మంద ప్రవీణ్, జాడి శేఖర్, మంథెన సమ్మయ్య, కట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయం : డీఎస్‌పీ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి హేయనీయమని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ తీవ్రంగా ఖండించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ నటుడు మోహన్‌బాబు తన నివాసం వద్ద వివరణ కోసం వెళ్లిన జర్నలిస్టులపై దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. తన తనయుడు మనోజ్ స్వయంగా మీడియాను పిలిచి జరిగిన కుటుంబ కలహాల వ్యవహారాలను ప్రత్యక్షంగా చూపించడం కోసం అక్కడకు తీసుకెళ్లారని అన్నారు. ఈ క్రమంలో దాడి జరిగిందని తెలిపారు. మీడియాపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకుడు చిట్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాగృతి నాయకులు నలమాస శ్రీకాంత్, గుండారపు రాజు, బాదావత్ రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీలు కీలకపాత్ర పోషించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల సమస్యలను పరిష్కరించడంలో బాలల పరిరక్షణ కమిటీలు ముఖ్య భూమిక పోషించాలని ఎంపీవో రహీం అన్నారు. గురువారం ములుగు మండలంలోని మల్లంపల్లిలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల పరిరక్షణ కమిటీల బలోపేతం ద్వారా పిల్లల సంక్షేమం, రక్షణకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. సమస్యలపై తగిన సమాచారాన్ని ఫోన్ ద్వారా అందించడం వల్ల పరిష్కారమార్గాలు వేగంగా లభించ గలవని తెలిపారు. కమిటీ సభ్యులు గ్రామాల్లో పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాల్య వివాహాలు, శారీరక, మానసిక వేధింపులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ స్పెషలాఫీసర్ నర్సయ్య, సోషల్ వర్కర్ జ్యోతి, చైల్డ్ హెల్ప్ లైన్ విక్రమ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ కమిటీ ఎన్నిక

కాటారం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్-1104యూని యన్ భూపాలపల్లి డివిజన్ కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఎల్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో యూని యన్ రీజనల్ అధ్యక్షుడు షేక్ జహురొద్దీన్, డిస్కం అదనపు కార్యదర్శి రంగారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో డివిజన్ అధ్యక్షుడిగా ఎం. శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శిగా కె.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రం సుమన్ కోశాధికారిగా బి. రాజు, అదనపు కార్యదర్శిగా కె. నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప కార్యదర్శి జగదీశ్, సహాయ కార్యదర్శి రమేష్, రాష్ట్ర ప్రాంతీయ నాయకులు మల్లయ్య, నర్సింగరావు, హరిహరాచారి, రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతలతో అధికారుల సమావేశం

మహదేవపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, వారి ప్రతిని ధులతో గురువారం మండల అధికారులు సమావేశం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచా యతీల ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహదేవపూర్ మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో మొత్తంగా 25,232 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలోని ప్రతీ వార్డులో ఉన్న ఓటర్లకు వార్డు వారీగా ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 162 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, సవరణలు ఉన్నట్లయితే రేపటిలోగా లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి.అక్బర్‌ఖాన్, బీజేపీ మండల అధ్యక్షులు ఎండి.అక్బర్ ఖాన్, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్ భారత రాష్ట్ర సమితి యూత్ ప్రెసిడెంట్ ఎండి.అలీమ్ పాల్గొన్నారు.

మండలానికి 108 వాహనం కేటాయించాలి

మల్హర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలానికి 108 వాహనం కేటాయించాలని వాసులు కోరుతున్నారు. మండలంలో 108 వాహనం లేకపోవడంతో అత్యవసర సమయంలో రోగులను ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి తీసుకొని వెళ్లాల్సి వస్తోందని తెలుపుతున్నారు. గతంలో మండలానికి సంబంధించిన వాహనం కొయ్యూర్‌లో ఉండేదని, కొన్ని కారణాలతో ఆ వాహనాన్ని ఇతర మండలానికి కేటాయించినట్లు పలువురు తెలుపుతున్నారు. మండలంలోని 15 జీపీలకు 40 పైగా అవాస గ్రామాలకు 108 వాహనం సేవలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి మండలానికి వాహనాన్ని కేటాయించాలని మండల వాసులు కోరుతున్నారు.

'మీసేవ'లో 9 రకాల నూతన సేవలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రంలో నూతనంగా తొమ్మిది రకాల సేవలను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని ఈడీఎం శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా రెవెన్యూ విభాగం నుంచి ఆరు రకాల సేవలు, ఫారెస్ట్ విభాగం నుంచి రెండు రకాల సేవలు, ఉమెన్‌అండ్‌చైల్డ్ వెల్ఫేర్, సీనియర్ సిటిజెన్ డిపార్టుమెంట్ నుంచి ఒక సర్వీసు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆపరేటర్లకు సూచించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ ధర తీసుకుంటే చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు.


ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి పులి దేవేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన దేవేందర్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గోవిందరావుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేటలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఇటీవల నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి క్రీడల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంఈవో గొంది దివాకర్‌లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

యూటీఎఫ్ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

మంగపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట మండలం పస్రా జడ్పీహెచ్ ఎస్ ఆవరణలో ఈనెల 14న జరిగే తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీ ఎఫ్) జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా కోశాధికారి ములుకాల వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వ హించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాచట్టంలోని హక్కులు, బాధ్యతలపై నిర్మొహమాటంగా సేవలందిస్తామని అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండం పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మాలోత్ రాజు, ఎస్.గంగాభవాని, కోశాధికారిగా టి.జ్ఞానేశ్వర్‌రావు, సభ్యులుగా ఎస్.సతీష్ కుమార్, శ్రీనివాసరావు, ఎం.కావ్య, డి.విజయ్‌కుమార్, బి.శ్రీను, కె.అశోక్, వీ.ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు

కాటారం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకులం క్రీడా మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మూడు రోజులుగా మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, యువత పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు. గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకులాలు, మేడిపల్లి ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో బహుమతులు సాధించారు. విజయం సాధించిన జట్లకు ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై అభినవ్, ఎంపీవో వీరస్వామి, ఎంఈవో శ్రీదేవి, ప్రిన్సిపాల్ లాల్ బహుమతులు, షీల్డ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు విజయలక్ష్మి, రమేష్, వీరన్న, మహేందర్, శ్రీనివాస్, రాజేశ్వరి, వెంకటేష్, శ్రీధర్, గౌతమి, శ్రీవిద్య, మజీం తదితరులు ఉన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


మొగుళ్లపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తహసీల్దార్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మూడురోజులుగా జరిగిన సీఎం కప్ మండలస్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. ఈసం దర్భంగా జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హుస్సేన్, ఎంఈవో కుమా రస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయు డు విజయపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రాజయ్య, సందీప్, మహేందర్, సంతోష్, పీఈటీలు శ్రావణి, అజయ్, కార్తీక్, సుదర్శన్ పాల్గొన్నారు.

8 ఇన్‌క్లైన్‌లో భద్రతా పక్షోత్సవాలు


మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

గణపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వరాజుపల్లి కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్టు 8 ఇన్‌క్లైన్‌లో గురువారం భద్రతా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలియజేస్తూ కార్మికులకు భద్రతా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రేడ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ జీఎం సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాకతీయఖని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఆస్పత్రిలో పేరుకుపోయిన సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌కు ఆ సంఘం నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రేడ్ మార్పు, వోడీలు వంటి సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని వినతిలో పేర్కొన్నారు. ఏరియా సింగరేణి ఆస్పత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఫిట్ సెక్రటరీ నల్ల రమేష్, నాయకులు ధనుంజయ్, పోషం, పర్వేజ్, భగత్ పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన

మల్హర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలు అంటే భయపడకుండా ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలని సైకాలజిస్ట్ మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన తాడిచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ విజయదేవి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని నివారించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలిమానస్ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.